
ఇల్లెందు రూరల్: జాతరకు తరలొచ్చిన భక్తులు


లక్ష్మీదేవిపల్లి : అమ్మవారిని గద్దెపైకి తీసుకొస్తున్న గణాచార్యులు


మణుగూరుటౌన్ : గద్దెల వద్ద పూజల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


లక్ష్మీదేవిపల్లి : అమ్మవారిని గద్దెపై ప్రతిష్ఠిస్తున్న గిరిజన పూజారులు


మణుగూరు టౌన్ : జన సంద్రంగా సమ్మక్క-సారక్క గద్దెల ప్రాంగణం

# జమిలిగా పూసిన జాజి మల్లెలే సమ్మక్క-సారక్క !

## భక్తజన సంద్రంగా మినీ మేడారాలు

మేడారంలో తెలంగాణ కుంభమేళా మొదలైంది. లక్షలాది మంది భక్తులు వన దేవతలను దర్శించుకునేందుకు వెళ్తున్నారు. అక్కడి జాతరకు అనుసంధానంగా భద్రాద్రి జిల్లా చర్ల మండలం సుబ్బంపేట పంచాయతీ పరిధిలోని ఎదురు గుట్టల్లో సుంకు జాతర, మణుగూరు మండలం తోగ్గూడెం, లక్ష్మీదేవిపల్లి మండలంలోని గడ్డిగుట్టలోనూ సమ్మక్క-సారక్క జాతర షురూ అయింది. తోగ్గూడెం సమీపంలోని రథంగుట్ట నుంచి ఆదివాసీ పూజారులు అడవి మార్గంలో మేళతాళాల నడుమ సమ్మక్కను గురువారం గద్దెల వద్దకు చేర్చారు. జాతరకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు అఖిల భారత అయ్యప్పదీక్ష ప్రచార సమితి సభ్యులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ మణుగూరు, వాసవీ వనితా వైభవ సభ్యులు అన్నదానం చేశారు. మణుగూరు- ఖమ్మం ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. ఎదురుగుట్టల సుంకు జాతరకు గిరిజన గణాచారులు వన దేవతలను గద్దెల వద్దకు తీసుకొచ్చారు. జాతరకు వచ్చే వాహనాలతో చర్ల- వెంకటాపురం మార్గం కిక్కిరిసింది. గిరిజనులను తమ ఆరాధ్య దైవాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తుల రాకతో గడ్డిగుట్ట జాతర కూడా కిటకిటలాడింది.ఇల్లెందు మండలం సంజయ్‌నగర్, బొజ్జాయిగూడెంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణాలూ భక్తులతో కిటకిటలాడాయి.

– చర్ల/లక్ష్మీదేవిపల్లి/మణుగూరు టౌన్/ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 22


చర్ల: ఎదురుగుట్టల జాతరలో భక్తుల సందడి

# ప్రాసెసింగ్ యూనిట్లు అవసరం

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


విత్తన పరిశోధన క్షేత్రంలో పంటలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : సాగు భూములకు అనుగుణంగా పంటల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం సుజాతనగర్ మండలంలోని రవి హైబ్రిడ్ వ్యవసాయ పరిశోధన క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. వివిధ రకాల వంగడాల విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో జన్మించిన మన్నేపల్లి రవి బీటెక్ చేసి విత్తన క్షేత్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎన్నో రకాల హైబ్రిడ్ విత్తనాలను తయారు చేసి మన రాష్ట్రానికే కాదు.. ఇతర రాష్ట్రాలకు కూడా అందుబాటులో ఉంచుతున్నారని అన్నారు. అనంతరం అంజనాపురం గ్రామంలోని టమాట విత్తన క్షేత్రాన్ని పరిశీలించారు. రవి తండ్రి కూడా తనకు బాగా పరిచయమని అన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ రైతుమిత్ర పేరుతో ఏటా రైతులకు ఉత్తమ అవార్డులు ఇస్తున్నామని, ఈసారి కూడా అవార్డులు మంత్రి తుమ్మల చేతులమీదుగా ఇస్తామని రవి ప్రకటించారు. మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండో బహమతి రూ.2 లక్షలు, మూడో బహుమతి రూ.లక్ష ఇస్తామన్నారు. మంత్రి వెంట వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, నాగసీతారాములు, నూకల రంగారావు, నల్లమల వెంకటేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి మరియన్న, నాయకులు ఉన్నారు.

# రుణ లక్ష్యాలను పూర్తి చేయండి : కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : బ్యాంకర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ.. నిర్దేశించిన రుణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. గురువారం ఐడీవోసీ సమావేశ మందిరంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రుణ లక్ష్యాల పురోగతిపై జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రుణ లక్ష్యాలకు సంబంధించిన వివరాలను బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం రూ.5599.30 కోట్ల రుణ లక్ష్యంకాగా.. అందులో ఇప్పటివరకు రూ.4175.83 కోట్లు మంజూరు చేసినట్లు అధికారులు ఆమెకు వివరించారు. అందులో వ్యవసాయానికి రూ.4309.34 కోట్లకు గాను.. రూ.1923.91 కోట్లు, చిన్నతరహా పరిశ్రమలకు రూ.426.55 కోట్లకు గాను.. రూ.377.32 కోట్లు, విద్యా రంగానికి రూ.202.80 కోట్లకు గాను.. రూ.7.45 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.536.22 కోట్లకు గాను.. రూ.12.26 కోట్లు, ఇతర మౌలిక వసతులకు రూ.50.02 కోట్లకు గాను.. రూ.91.65 కోట్లు ఇప్పటి వరకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్డీవో విద్యాచందన, ఎల్‌డీఎం రామిరెడ్డి, నాబార్డు డీడీఎం సుజిత్, పరిశ్రమల శాఖ అధికారి తిరుపతయ్య, బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గర్భిణులకు సాధారణ ప్రసవాలే చేయాలి

### భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి 22: గర్భిణులకు సాధారణ ప్రసవాలే చేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ పీవో కార్యాలయంలో గురువారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితోపాటు పలు ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన స్త్రీల వైద్య నిపుణులు, రేడియాలజిస్టులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఆసుపత్రులకు ఏజెన్సీ నుంచి నిరుపేదలే వస్తారని, వారి నుంచి డబ్బులు వసూలు చేయాలనే ఆలోచన మానుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులకు సాధారణ ప్రసవాలే చేయాలని, అత్యవసరమైతే తప్ప సిజేరియన్ ఆపరేషన్లు చేయొద్దన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన అనుమతులు లేకుండా గర్భిణులకు గర్భస్రావం చేసినా నేరమేనన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో శిరీష, వైద్యులు రామకృష్ణ, చైతన్య పాల్గొన్నారు.

# స్కూళ్లకు నేడు మేడారం జాతర సెలవు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 : మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను పురస్కరించుకొని శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సెలవు ప్రకటించారు. గద్దెలపైకి సమ్మక్క-సారలమ్మ రాకను పురస్కరించుకొని జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లే అవకాశం ఉన్నందున స్థానిక ఎమ్మెల్యేలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. 23న సెలవుకు బదులుగా వచ్చే నెల 9న రెండో శనివారం సెలవును రద్దు చేస్తున్నామని ప్రకటించారు.

# నాడు కరువు పీడిత ప్రాంతం నేడు కడుపు నింపే క్షేత్రం

- నాడు సూరత్‌కు వలస వెళ్లిన తిరుమలాయపాలెం ప్రజలు
- నేడు ఇక్కడికే వలస వస్తున్న ఇతర రాష్ట్రాల కూలీలు
- కూలి పనులతో బతుకుదెరువునిస్తున్న మండల రైతులు
- 'మిషన్ కాకతీయ', 'భక్తరామదాసు'తో తొలగిన సాగునీటి కష్టాలు
- కరువు నేలను కోనసీమలా మార్చిన ఘనత పొందిన గత కేసీఆర్ ప్రభుత్వం

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 22 : ఎన్నో ఏళ్లుగా కరువుపీడితంగా కొనసాగిన తిరుమలాయపాలెం మండలం నేడు కడుపునింపే ప్రాంతంగా విరాజిల్లుతోంది. సాగునీటి వనరులు లేక, సరైన పనులు లభించక నాడు హైదరాబాద్, సూరత్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లిన ఇక్కడి ప్రజలు.. ఇప్పుడు దేశంలోని అనేక రాష్ట్రాల ప్రజలకు ఆశ్రయమిస్తున్నారు. కూలి పనులు కల్పించి బతుకుదెరువునిస్తున్నారు. స్వరాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ సారథి కేసీఆర్.. పదేళ్లనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రాష్ట్రంలో కరువు కాటకాలను రూపుమాపాలని సంకల్పించారు. ఇందులో భాగంగానే కరువుపీడిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అప్పటికే కరువు మండలంగా కునారిల్లుతున్న తిరుమలాయపాలెంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. మిషన్ కాకతీయ పథకంలో చెరువులు, కుంటలను అభివృద్ధి చేసిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. భక్తరామదాసు ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంతంలో జలసిరులు పారించారు. కరువు నేలను కోనసీమలా తీర్చిదిద్దిన ఘనత సాధించారు.

### నేడు ఇక్కడికే వలసలు..

ఉపాధి కోసం నాడు ఇక్కడి నుంచి అనేక మంది ప్రజలు వలస వెళ్తున్న దృశ్యాలు సాక్షాత్కరించేవి. కానీ.. నేడు ఇదే తిరుమలాయపాలెం మండలంలోని ఏ గ్రామంలో చూసినా ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలే కనిపిస్తున్నారు. ఇప్పుడు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ కూలీలు వలస వచ్చి ఇక్కడి రైతుల మిర్చి తోటల్లో పనులు చేస్తున్నారు. మండల కేంద్రమైన తిరుమలాయపాలెంతోపాటు కొక్కిరేణి, తాళ్లచెరువు, పిండిప్రోలు, దమ్మాయిగూడెం, జూపెడ, బచ్చోడు, బీరోలు వంటి గ్రామాల్లోని మిర్చి తోటల్లో సుమారు 2,000 మందికి పైగానే ఇతర రాష్ట్రాల కూలీలు మిరపకాయలు కోస్తూ బతుకుదెరువు వెళ్లదీసుకుంటున్నారు.

### నాటికీ.. నేటికీ ఎంతో తేడా..

ఉమ్మడి పాలనలో ఉన్న తిరుమలాయపాలెం మండలానికీ, నేటి స్వరాష్ట్రంలోని తిరుమలాయపాలెం మండలానికీ ఎంతో వ్యత్యాసం స్పష్టంగా కన్పిస్తోంది. సాగునీటి అవకాశాలులేక దుర్భరంగా ఉండేది ఇక్కడి రైతుల దుస్థితి. సాగునీరు వనరులు లేక.. వానకాలం పంటలు కూడా నవంబర్, డిసెంబర్ నెలల్లోనే ఎండిపోయేవి. పెద్ద రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతులు కూడా దిక్కుతోచని స్థితిలో ఉండేవారు. ఇక వ్యవసాయ కూలీల పరిస్థితి అయితే మరీ దయనీయం. అందుకే అందరూ కలిసి వలస వెళ్లేవారు. అలాంటి పరిస్థితులున్న తిరుమలాయపాలెం మండలంలో తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఉద్యమనేత కేసీఆర్ పాలనలో సిరులు పండే పరిస్థితులు ఏర్పడ్డాయి. నాడు కూలి దొరికితే చాలు అనుకున్న ఇక్కడి రైతులు, కూలీలు.. నేడు అన్ని సౌకర్యాలూ కల్పించి ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకొచ్చి కూలి పనులు కల్పిస్తున్నారు. నికరంగా పనులు దొరకడం, కూలి ధరలు కూడా మెరుగ్గానే ఉండడం వంటి కారణాలతో వలస కూలీలు కూడా ఉపాధి పొందుతున్నారు.


తిరుమలాయపాలెం: తాళ్లచెరువు ప్రాంతంలో మిరపకాయలు కోస్తున్న వలస కూలీలు

### కేసీఆర్ కృషి వల్లనే కరువు కాటకాలు తొలగిపోయాయి..



కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషి వల్లనే మా ప్రాంతంలో కరువు కాటకాలు తొలగిపోయాయి. కరువు పీడిత మండలాన్ని కడుపునింపే ప్రాంతంగా తీర్చిదిద్దిన ఘనత ముమ్మాటికీ గత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుంది. గత కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమేగాక సాగునీటి వనరులు ఏర్పాటు చేసింది. దీంతో బీళ్లన్నీ సెల ఏళ్లయ్యాయి. రెండు పంటలూ పుష్కలంగా పండుతున్నాయి. ఫలితంగా అన్నదాతలందరమూ ఆనందంగా ఉంటున్నాం. ఇతర రాష్ట్రాల కూలీలకు పనులు కల్పించామన్న సంతృప్తిని పొందుతున్నాము. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన ఘనత, ఇక్కడి వలసలను ఆపిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది.

–చామకూరి కిరణ్, రైతు, పిండిప్రోలు, తిరుమలాయపాలెం మండలం

# పదిలో కష్టపడి చదివితేనే ఫలితం

### ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 22 : పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి ఫలితం ఉంటుందని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. నగరంలోని నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేసిన ఆయన ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఉదయం, సాయంత్రం అదనపు సమయాలతోపాటు ఆదివారాల్లో కూడా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎం నర్సింహారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వంతెన పూర్తి కాక వెతలు

- వేపలగడ్డ వద్ద నిలిచిన ఆర్వోబీ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- రైళ్లు వచ్చే సమయంలో గేటు మూసివేత.. భారీగా ట్రాఫిక్ జామ్


వేపలగడ్డ వద్ద అసంపూర్తిగా వంతెన

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఖమ్మం నుంచి కొత్తగూడెం వచ్చే ప్రధాన మార్గంలోని సుజాతనగర్ మండలం వేపలగడ్డ వద్ద సింగరేణి యాజమాన్యం, ఆర్‌అండ్‌బీశాఖ సంయుక్తాధ్వర్యంలో రూ.45 కోట్ల వ్యయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నాయి. పనులు 90శాతం పూర్తయినప్పటికీ వంతెన ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. ఇక్కడ రైల్వే లైన్ ఉండడంతో ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం, రాష్ట్రప్రభుత్వం భాగస్వామ్యంలో వంతెన నిర్మించాలని సంకల్పించాయి. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం కాగా మొదట్లో పనులు వేగంగానే సాగాయి. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డుతో పాటు చిన్న చిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. వంతెన కింద రైలు మార్గం ఉండడంతో రైల్వే సిబ్బంది రైళ్లు వచ్చే సమయంలో గేటు వేస్తున్నారు. ఇలా రోజుకు మూడు నాలుగు సార్లు గేటు మూసేయాల్సిన పరిస్థితి. దీంతో ఆ ప్రాంతంలో ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్ అవుతున్నది. రైళ్ల రాక ఆలస్యమైతే ప్రయాణికులు గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రైల్వేమార్గం గుండా ప్రతిరోజూ సింగరేణి సంస్థ కేటీపీఎస్‌తోపాటు ఇతర ప్రాంతాలకు బొగ్గు రవాణా చేస్తుంది. రైల్వే లైన్ నుంచి కేవలం గూడ్స్ రైళ్లే వెళ్తాయి. రైళ్ల ప్రయాణంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే ఇక అంతే సంగతులు. ఇక రైల్వే గేటు ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి. వంతెన పనులపై 'నమస్తే' ఆర్ అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. కేవలం అప్రోచ్ రోడ్ పనులే మిగిలి ఉన్నాయని, పనులు పూర్తి చేసి రెండు నెలల్లో వంతెన ప్రారంభిస్తామని సమాధానమిచ్చారు.

### రైల్వే గేటుతో ఇబ్బందిగా ఉంది



బొగ్గు రవాణా చేసే రైలు బండ్లు వేళాపాళా లేకుండా సత్తుపల్లి నుంచి వస్తాయి. ఒక్కోసారి ఖాళీ వ్యాగన్లు సైతం వెళ్తుంటాయి. ఇటువంటప్పుడు గేటు పడితే ఎమర్జెన్సీ పనులు ఉన్న వారికి చాలా కష్టంగా ఉంటుంది. ఒక్కోసారి లోడ్ లారీలు వచ్చినప్పుడు గేట్ పైన ఉన్న రెయిలింగ్ తగిలి లారీలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. రాత్రి సమయాల్లో చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎవరైనా నాయకులు ఊరేగింపు పెడితే గంటలకొద్దీ నిలబడక తప్పడం లేదు. పైనుంచి వెళ్లేందుకు వంతెన కట్టినా ఇప్పటివరకు ప్రారంభించలేదు.

– బొడ్డు కేశవరావు, తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు, సుజాతనగర్